'స్వాతి' వారపత్రిక - 30-06-2000

# వర్షం కురిసిన రోజు

ఆకాశంలోకి సూర్యుడు బారెడు పైకి లేచినా, వర్షమేఘాలు కమ్ముకోవడంవల్ల చీకటి ఆవరించిన వెలుతురు మందకొడిగా ఉంది. ఊరి చివరినున్న ప్రశాంతి నిలయంలో అశాంతి వాతావరణం నెలకొంది. ఇంటి యాజమాని రాఘవరావు పొడుగాటి భోజనాల బల్ల మొదట్లో ఉన్న కుర్చీలో కూర్చుని, సెగలు కక్కుతూన్న ఇడ్లీ ప్లేటుని ముందరకు తీసుకొని, ఒక్క ముక్కైనా నోట్లో పెట్టుకోకుండా పొగలుకక్కనారంభించాడు.

"లేనివాళ్లు ఆడపిల్లల పెళ్లిళ్లు చేయ్యడానికి ఎన్నో అగచాట్లు పడ్తోంటే, అన్నీ ఉన్న నాకు మీరు యింట్లోనే యిబ్బందులు పెట్టేస్తున్నారు! ఇప్పుడు వచ్చిన ఈ సంబంధాల్ని కాలదన్నుకొంటే నష్టపోయేది మీరే! ఏవో కారణాలు చెప్పి వాయిదాలు వేసుకొంటూ కూర్చుంటే వయసు కొండెక్కి కూర్చుంటుంది! అప్పుడు మీ చదువూ, నా ఆర్థిక స్తోమతా ఎందుకూ పనికిరావు. ఆలోచించుకోండి!"

కొడుకులిద్దరూ, కోడళ్లిద్దరూ ఆయన కోపం చూసి మౌనంగా ఉండిపోయారు. ఇంటి ఇల్లాలు శాంభవికి ఇక మాట్లాడక తప్ప లేదు.

"తినేముందర తగువులు పెట్టుకోవడం మీకందరికీ బాగా అలవాటైపోయింది! ముందర మీరందరూ త్వరగా బ్రేక్‌ఫాస్ట్ కానిస్తే, మీకూ గింజుకోడానికి కాస్తింత బలముంటుంది!"

"ఆ చట్నీ గిన్నె ఇటివ్వండి" అన్నాడు రాఘవరావు జనాంతికంగా. తండ్రికి ఓ పక్కగా కూర్చున్న పెద్దకొడుకు గణపతి చట్నీ గిన్నెను అందుకొని తండ్రికి దగ్గరగా పెట్టాడు. 'అమ్మయ్యా!' అనుకొంది శాంభవి. కాఫీ, టిఫిన్లు పూర్తయి అందరూ లేచి నెమ్మదిగా జారుకోబోయే సమయంలో, "ఆగండి, వీళ్లిద్దరి పెళ్లి విషయమూ ఈ రోజు తేలిపోవాలి!" అన్నాడు రాఘవరావు.

"హాయిగా హాల్లో కూర్చుని మాట్లాడు కొంటే బావుంటుంది" అంది శాంభవి.

అందరూ హాల్లోకి పోయి కూర్చున్న తర్వాత, రాఘవరావు ఓ బల్ల సొరుగులోంచి ఫోటోలున్న ఓ కవరు తీసుకువచ్చి సోఫా ముందుగా ఉన్న గ్లాస్‌టాప్ టేబుల్ మీద పడవేసి, భార్య శాంభవి పక్కన కూర్చుంటూ, పార్వతి కేసి చూస్తూ అన్నాడు - "ఇప్పుడు చెప్పు".

"సమాధానం చెప్పేలోపుగానే మాట కద్దుతగిలి మీరు విసుక్కుంటే, ఎలా? ఆ మధ్యన మీరు మా పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చినప్పుడు సరేనంటేనే కదా, ఈ సంబంధాల్ని వెదికి తీసుకువచ్చారు! అంటే పెళ్ళికి మేం అభ్యంతరం చెప్పనట్లేకదా?" - పార్వతి ప్రశ్నించింది, తల్లికేసి చూస్తూ, తండ్రిని సంబోధిస్తూ.

"నిజమే, కాదనటల్లేదు. ఫోటోలతో పంపిన వివరాల్నీ, విద్యార్హతలనీ, కుటుంబ సాంప్రదాయాల్నీ పరిశీలించి, జాతకాలు కుదరని వాళ్లనీ, అటుపైన నాకే నచ్చని వాళ్లనీ ఫిల్టర్

చేసిన తర్వాత ఆరుగురు మిగిలారు. ఫోటోల్లో అందరూ అందంగా, ఆకర్షణీయంగా కనబడ్తున్నారు. అందులో ఇద్దరు డాక్టర్లు నలుగురు ఇంజనీర్లు. మీకిద్దరికీ ఈ ఆరు ఫోటోలూ, వివరాలూ యిచ్చి వారం రోజులైంది. వీళ్లలో ఏ ఒక్కరూ మీకు నచ్చలేదంటే నేను నమ్మలేకపోతున్నాను. కనబడ్డ సంబంధమల్లా గుమ్మంలోకి తీసుకువచ్చి మిమ్మల్ని దుకాణంలో వస్తువుల్లా చూపించడం నా కిష్టం లేదు. అందుకనే ఈ ఫోటోల్లో మీకు బాగా నచ్చిన వాళ్లెవరైనా ఉంటే, ఆ సంబంధాల వైపు మరో అడుగు వేద్దామనుకొన్నాను. కాని మీరు తల అడ్డంగా ఊపినట్లు మీ అమ్మ చెప్పింది..." అంటూ ఒక్క క్షణం ఆగి మళ్లీ అన్నాడు – "పోనీ మీరెవర్నైనా ప్రేమిస్తున్నారా? ధైర్యంగా చెప్పండి!"

"ఛ!ఛ! అటువంటిదేమి లేదు నాన్నగారు!" అంది పార్వతి కాస్తగా తెల్లబోతూ.

"నీ సంగతి చెప్పావు, మరి చెల్లాయి సంగతో?"

"నా విషయంలోనూ అటువంటిదేమీ లేదు నాన్నగారూ! అంది లక్ష్మీసరస్వతి.

"మరి...?"

"వద్దన్నందుకు కారణాలు చెప్పమని నిర్బంధిస్తున్నారు. చెబ్తాను. కాని విన్న తర్వాత మరి గందరగోళం చెయ్యకూడదు. సరేనా?" పార్వతి తండ్రికేసి చూస్తూ అన్నది.

"అలాగన్నావు బావుంది. ప్రొసీడ్" అన్నాడు రాఘవరావు, కాస్త నవ్వు చిందిస్తూన్న మొహంతో.

పార్వతి గ్లాస్‌టాప్ టేబుల్ మీదున్న కవరు తీసుకొని, అందులోంచి ఒక్కొక్క ఫోటోని తీస్తూ, చూస్తూ చెప్పసాగింది.

"ఇతని పేరు నారాయణ, బి.ఇ. (ఎలక్ట్రికల్). ఈ ఫోటోలో ఉన్నతని పేరు కృష్ణమూర్తి, ఎమ్.టెక్ (ఎలక్ట్రానిక్స్). ఇదిగో ఈయనగారు రామకృష్ణ, ఎమ్.ఎస్.. ఈయన పద్మనాభం, ఎమ్.డి.. ఈ అయిదో అతను శ్యామ్రావు, ఎమ్.ఇ. (మెకానికల్). ఆఖరుగా ఈయనగారు లక్ష్మీపతి, ఎమ్.టెక్ (కెమికల్ ఇంజనీరింగ్). అందరికీ విద్యార్హతలు బావున్నాయి, ఫోటోల్లో బాగానే ఉన్నట్టున్నారు, కాని...."

"కాని...? ఆగిపోయావేం?" అంతవరకూ నోరు విప్పని పెద్దన్న గణపతి ప్రశ్నించాడు.

"కాని అక్కయ్యకి ఆ పేర్లేవీ నచ్చలేదు!" అంది లక్ష్మీసరస్వతి కళ్లింతగా చేస్తూ.

అందరూ తెల్లబోయారు.

"ఇదేం చోద్యం?! ఐశ్వర్యాల్ని కొరుక్కుతినవచ్చునేమోకాని, అందాలనీ, పేర్లనీ కొరుక్కుతింటామా?!" శాంభవి నిశ్శబ్దాన్ని చీలుస్తూ అంది.

"పేరులోని గొప్పదనం దానిలో ఉన్న అక్షరాలవల్ల రాదు. మనిషిలోని వ్యక్తిత్వమూ, మనిషి సాధించిన పనులూ పేరుకి ప్రాముఖ్యతని తెస్తాయి. నువ్వు చెప్పిన కారణం అసహజంగా ఉంది చెల్లాయ్!" అన్నాడు రెండో అన్న గోపాలకృష్ణ.

"ప్రతి మనిషికీ కొన్ని చాదస్తాలూ, నమ్మకాలూ ఉంటాయి. నాకూ కొన్ని నమ్మకాలున్నాయి.

వాటిని మీరు గౌరవించాలి!" అంది పార్వతి.

"పేరులోని సొంపు కాదు, అంతకు మించిన అంతర్యమేదో ఉంది. వివరంగా చెప్పు" అన్నాడు రాఘవరావు.

"చెప్పినదానితో సర్దుకోకపోతే, యిక నేను నిజం చెప్పక తప్పదు. ఆ తర్వాత నన్నేనీ ఏమాత్రం ప్రయోజనంలేదు! చెప్పమంటారా?"

"చెప్పి ఏడు!" అన్నాడు రాఘవరావు కాస్త విసుగ్గా.

"నాన్నగారూ మీ పేరు రాఘవరావు, అమ్మ పేరు శాంభవి, పెద్దన్న పేరు గణపతి, పెద్ద వదిన పేరు నాగలక్ష్మీదేవి, రెండో అన్న పేరు గోపాలకృష్ణ, రెండో వదిన పేరు దుర్గ, మీ అందరివీ జాతకాలు కలిసిన జోడీలేమో కాని, పేర్లు కలిసిన జోడీలు కావు! మీవన్నీ దైవాపచారం జోడీలు!"

దూరంగా ఎక్కడో పిడుగుపడింది.

"అంటే...?" శాంభవి అయోమయంగా అడిగింది.

"ఈ యువకులందరీ పేర్లూ విష్ణురూప నామాలు, నాపేరు పార్వతి. వీళ్లలో ఎవర్ని కట్టుకొనీ నేను అపచారం చెయ్యలేను! శివరూప నామాలు కల కుర్రవాళ్ల సంబంధాల్ని మాత్రమే వెదకండి! వాళ్లు లాయర్లూ, టీచర్లూ అయినా నాకు పర్వాలేదు!"

రాఘవరావు నుదుటి మీద స్వేదబిందువులు జారసాగాయి. శివుడూ, నీలకంఠుడూ అంటున్నందుకు కాదు. లాయరూ, టీచరూ కూడా సరే అంటున్నందుకు!

"సరేలే, ఉమాపతీ, గౌరీపతి, శంభులింగం, జంబులింగం లాంటి పేర్లు కలవాళ్ల వేట మొదలు పెడ్తాను! అపైన నీ అదృష్టం" అని పార్వతిని ఉద్దేశిస్తూ అని –

రెండో కూతురు లక్ష్మీసరస్వతి వైపు చూస్తూ మళ్లీ అన్నాడు – "నీ పేర్లో యిద్దరి దేవతల పేర్లున్నాయే! విద్యార్హతలు కల ఎంతమంది కృష్ణబ్రహ్మంలు దొరుకుతారన్నది ఓ పెద్దసమస్యే!"

"నాన్నగారూ నాకు అక్కలాంటి చాదస్తాలు లేవు! ఈ ఫోటోల్లోని కుర్రాళ్లందరూ బాగానే ఉన్నారు కాని....."

"కాని...? నీకేం గొంతెమ్మ కోర్కెలున్నాయి?!" రాఘవరావు ప్రశ్నించాడు.

"నాన్నగారూ! వీళ్లందరి క్వాలిఫికేషన్సూ చూశాను. నాకు డొనేషన్ కట్టి సీట్లూ, డిగ్రీలూ సంపాదించిన యువకులంటే యిష్టంలేదు! కేవలం మెరిట్ మీద డిగ్రీలు సంపాదించిన వాళ్లంటేనే యిష్టం. అందుచేత వీళ్లందరూ ఈ విద్యార్హతలెలా సంపాదించిందీ కాస్త వాకబు చెయ్యండి!"

ఈ మాటు దగ్గర్లో మేఘగర్జనలూ, మెరుపులూ! రాఘవరావు గుండెల్లో రైళ్లు! ఎమ్.ఎ.(ఫిలాసఫీ), ఎమ్.ఎ.(లిటరేచర్) చదివిన అమ్మాయిలకి ఐ.ఐ.టి యంజనీర్లూ, ఎ.ఎఫ్.ఎమ్.సి. డాక్టర్లూ ఎక్కడ దొరుకుతారు?!

❁ ❁ ❁

కింద హాలుకి కుడిపక్కగా ఉన్న గదిలో పడుకొని సిగరెట్ కాలుస్తున్న గణపతిని కాస్త

జరిపి, పక్క మీద కూర్చుంది నాగలక్ష్మీదేవి.

"ఏఁవండీ, రెండు నెలల్లో మనకి పాపో, బాబో పుట్ట బోతున్నారు కదా? మీరు వదుల్తున్న సిగరెట్ పొగ రింగుల్లాగే, మీ ఇంటి ఆడపడుచులకి తల రింగులూ, తలతిక్కలూ ఉన్నట్టు ఈ ఉదయం తెలిసిందికదా?!

"ముక్కోటి దేవతల బహురూప బహువిధ నామధేయాలకీ, వంశపారం పర్యంగా పెట్టే మాతామహ, పితామహ, మాతృమాత, పితృమాత నామధేయాలకీ విరుద్ధంగా, విభిన్నంగా, ఆత్మస్థైర్యాన్నీ, వ్యక్తి వికాసాన్నీ ప్రకటించే అనూహ్యమైన అర్ధసహిత, అర్ధరహిత ఆధునిక నామధేయాలు క్రోడీకరించిన పుస్తకాలు ఈ మధ్య చాలా వెలువరించబడ్డాయి. ఎందుకైనా మంచిది, రేపు మీరు ఆఫీసు నుంచి తిరిగి వచ్చేటప్పుడు ఒకటి రెండు ఆ పుస్తకాలు కొనిపట్టుకు రండి!" అంటూ ఓ చిన్న ఉపన్యాసమిచ్చి, చిన్న కోరిక కోరింది.

"నాన్నగారికి సెంటిమెంటు ఎక్కువ, పార్వతి అన్న మాటలు ఆయన దృక్పథంలో మార్పు తీసుకొస్తే చెప్పలేను కాని, మనకి పుట్టే పిల్లలకి మా అమ్మానాన్నల పేర్లు కనక పెట్టకపోతే రేపు ఆస్తి పంపకాల్లో గొడవ జరిగిపోవచ్చు. పుస్తకాలంటే కొంటాను కాని, ముందస్తుగా నువ్వు నోరు జారకు!" అన్నాడు గణపతి.

❁ ❁ ❁

"మీ పెద్ద చెల్లెలు తింగరబుచ్చిలా మాట్లాడింది. మీ రెండో చెల్లెలుకీ తిక్కలేమీ తక్కువ కాకపోయినా, తనన్న మాటల్లో కాస్త నిజముంది. నా కిప్పుడు అయిదో నెల గడుస్తోంది. మనకి పుట్టబోయేవాళ్లు మెరిట్‌తోనే పైకి రావాలి! డూన్ స్కూల్లో ఎడ్మిషన్ కోసం పాపలు పుట్టకముందే రిజిస్టరు చేసుకొంటారట! ఆ విషయమై చూడండి!" అంది దుర్గ.

"మేమందరమూ అప్పలాచార్య హైస్కూల్లో చదువుకొని పైకి వచ్చిన వాళ్లమే! కావాలంటే ఓ పర్సనల్ కంప్యూటర్ కొనిపారేస్తాను. దాని ముందర కూర్చుని కడుపులో పాపాయికి కంప్యూటర్ నేర్పు" అన్నాడు గోపాలకృష్ణ చిన్నగా నవ్వుతూ.

❁ ❁ ❁

మేడ మీద నైఋతి మూల పడగ్గదిలో కిటికీ పక్కన కూర్చుని, వర్షపు రాత్రిలోకి చూస్తున్న రాఘవరావు, ఆ ఉదయం కూతుళ్లిద్దరూ యిచ్చిన షాక్ నుంచి పూర్తిగా కోలుకోలేదు. వాళ్లు కాస్త తలతిక్కగా వ్యవహరించినా, వాళ్లిద్దరూ అంటే ఎంతో, యిష్టం. వాళ్ల కోరిక తను తీర్చకపోతే మరెవరు తీరుస్తారు? తెరచిన కిటికీ ఊచల్లోంచి వర్షపు జల్లు మొహం మీద పడ్తోంటే రాఘవరావు మనసు ఒకింతగా తేలిక పడింది, తల తిప్పి మంచం వైపు చూశాడు.

పమిట జారిన శాంభవి కనులు మూసి పడుకొని ఉంది. రాఘవరావు నెమ్మదిగా లేచివెళ్లి, పక్క మీద కూర్చుని శాంభవి జబ్బ మీద చేయివేశాడు.

"దూరం, దూరం! అపచారం!" అంది శాంభవి, ఉందో లేదో తెలియని నిద్ర మత్తులో.

ఇంకా కొన్ని వసంతాలు చవిచూడవలసిన తమ జీవితంలో, పెద్ద కూతురు పార్వతి ముగ్గనీళ్లు పోసేసిందా?! రాఘవరావుకి పెద్ద కూతురు మీద కోపం వచ్చింది. ఇంటికి దగ్గరగా నైఋతి దిశలో చెవులు చిల్లులు పడేలా శబ్దం చేస్తూ పిడుగు పడింది! ❁